క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం..



కల్యాణోత్సవంలో గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వర స్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన చేసి అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సీఐ క్రిష్టయ్య

బద్వేలు అర్బన్ : శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తామని బద్వేలు రూరల్ సీఐగా ఎన్.క్రిష్టయ్య తెలిపారు. బద్వేలు రూరల్ సీఐగా ఎన్.క్రిష్టయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని బద్వేలు రూరల్, అట్లూరు, బి.కోడూరు ఎస్ఐలు సీఐని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఎం.నాగభూషణ్ సీ.కె.దిన్నె అప్‌గ్రేడ్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

బాధ్యతల స్వీకరణ



వేణుగోపాల్

ప్రొద్దుటూరు క్రైం : త్రీటౌన్ సీఐగా వి.వేణుగోపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన కడప ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తూ ప్రొద్దుటూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ గోవిందరెడ్డి కడప ఎస్సీ ఎస్టీ సెల్‌కు బదిలీ అయ్యారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తానని సీఐ వేణుగోపాల్ ఈ సందర్భంగా తెలిపారు. నేరాల కట్టడికి కృషి చేస్తానని, ఏదైనా సమస్య వస్తే ప్రజలు నేరుగా స్టేషన్‌కు రావాలన్నారు.

అటవీ ఉద్యోగులపై దాడి అమానుషం



ఫారెస్టు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అటవీ ఉద్యోగులు

పోరుమామిళ్ల : శ్రీశైలం శిఖరం చెక్ పోస్ట్ దగ్గర అటవీ సిబ్బందిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దాడి చేయడం అమానుషమని కడప జిల్లా ఫారెస్ట్ అసోసియేషన్ ప్రొద్దుటూరు యూనిట్ వైస్ ప్రెసిడెంట్ కరుణాకర్, సెక్రటరీ రమణ తెలిపారు. అటవీ ఉద్యోగులపై జరిగిన దాడినిన నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అధికారులు సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు గురువారం పోరుమామిళ్ళ రేంజ్‌లోని ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది స్థానిక ఫారెస్టు కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం శిఖరం చెక్ పోస్ట్ దగ్గర అటవీ సిబ్బందిపై భౌతిక దాడి చేసి దూషించిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డిని, ఆయన అనుచరులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అసోసియేషన్ ప్రొద్దుటూరు యూనిట్ సభ్యులు శ్రీనివాసులు, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ గోవిందమాంబ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ స్వామిరెడ్డి తెలియజేశారు. జంప్ రోప్ పోటీలు నెల్లూరు జిల్లాలోని కావలిలో నిర్వహించారని, అందులో తమ పాఠశాల విద్యార్థులు సి.జస్సి-గోల్డ్, సిల్వర్ మెడల్స్ , బి.నాగ శ్వేత-సిల్వర్ మెడల్, పి.ఉమామహేశ్వరీ-సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆయన తెలిపారు.అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్ లోని 3వ లగోరి రాష్ట్రస్థాయి పోటీలు కడప జిల్లాలోని మైదుకూరులో నిర్వహించగా ఆ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి రెండవ స్థానం సిల్వర్ మెడల్ సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు.

శాంతి ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి సేవా భావాన్ని అలవర్చుకోవాలని, విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని కోరారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

అరటి.. నష్టాలు మిగిల్చి..!

- తగ్గిన అరటి ధరలు
- పెట్టుబడి రాని వైనం
- ఆందోళనలో రైతులు



లారీకి అరటి కాయలను లోడ్ చేస్తున్న కూలీలు

కాశినాయన : ఆరుగాలం కష్టపడి పండించే అన్నదాతకు అడుగడుగునా అవరోధాలు ఎదురవుతున్నాయి. ఒక పక్క అతి వృష్టి, మరో పక్క అనావృష్టి. చీడపీడలు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు రైతులను నట్టేట ముంచుతున్నాయి. అరకొర వస్తున్న బోరుబావుల నీటితో పంటలను సాగు చేస్తే తీరా దిగుబడి వచ్చే సమయానికి ధరలు తగ్గి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 4వేల ఎకరాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారు. తీరా పంట కోతకు వచ్చే సమయానికి ధరలు పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఒక ఎకరా అరటి పంటను సాగు చేయాలంటే మొక్కలకు రూ.15వేలు, సేద్యాలకు రూ.15వేలు, కలుపులకు రూ.5వేలు, పురుగు మందులకు రూ.10వేలు, రసాయనిక ఎరువులకు రూ.40వేలు మొత్తం కలిపితే రూ.85వేలు పెట్టుబడి వస్తుంది. బాగా పండితే 14 నుంచి 18 టన్నులు దిగుబడి వస్తుంది. అయితే ధరలు పతనం కావడంతో రైతులు పెట్టుబడి కూడా రాదని అన్నదాతలు వాపోతున్నారు. ఒక్క సారిగా ధరలు కుప్పకూలిపోవడంతో లబోదిబోమంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

గత 15 రోజుల క్రితం టన్ను ధర రూ.15వేలు పలికింది. వర్షాలు కురవడంతో దిగుమతులు ఆగిపోయాయని ధరలను ఒక్క సారిగా తగ్గించారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం అరటి ధర టన్ను రూ.9వేలకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉండే వ్యాపారులు సిండికేట్ అయి ఒకే ధరను నిర్ణయించి కొనుగోలు చేయడంతో ధర పెరిగే పరిస్థితి లేదు. ఢిల్లీకి చెందిన వ్యాపారులు వస్తే రేట్లు పెంచుతారు. ఢిల్లీ వ్యాపారులు నవంబర్‌లో కానీ పంటలను కొనుగోలు చేయరు. వారు వస్తేనే ధర పెరిగితే పది రూపాయలు రైతులకు ఆదాయ వస్తుంది. ఇలాగే ఉంటే పెట్టుబడులు రాక అప్పులు పాలు కావాల్సిందేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అరటి పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు

ధరలు పతనం అయ్యాయి



ఏడాదిపాటు కష్టపడి అరటి పంటను పండిస్తే దళారులు నిర్ణయించిన ధరలకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతులు ధర నిర్ణయించుకునే అవకాశం లేదు. వారు చెప్పిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. అరటి పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో నష్టపోవాల్సి వస్తోంది.

- పోలయ్య, రైతు, నాయునిపల్లె, కాశినాయన మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



అరటి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రతి ఏటా ఎరువుల ధరలు, పెట్టుబడులు పెరుగుతున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగు మందులు పెరగడంతో పెట్టుబడి కూడా పెరుగుతోంది. అరటి పంట ధరలు తగ్గడంతో ఇబ్బంది పడుతున్నాం. ఇలానే ఉంటే అప్పులు పాలు కావాల్సి వస్తుంది. అరటి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- శేషారెడ్డి, రైతు, ఆకుల నారాయణపల్లె, కాశినాయన మండలం

గణపతి మహోత్సవాలకు ఏర్పాట్లు



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 29వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గణపతి మహోత్సవ కమిటీ అధ్యక్షుడు మార్తెళ్ల మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975 నుంచి గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు, హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. ఈ ఏడాది గణపతిని ఆపరేషన్ సింధూర్ విజయ్‌గణపతి పేరుతో పంచముఖ మట్టి గణపతి నెలకొల్పుతున్నట్లు చెప్పారు. కోల్‌కతా నుంచి ఈ విగ్రహాన్ని తెప్పించామని, 27న మధ్యాహ్నం 3 గంటలకు సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, సాయంత్రం 6 గంటలకు దైవ భక్తిగీతాలు, 28న మధ్యాహ్నం 3 గంటలకు హైస్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీమన్నారాయణ కోలాట భక్తబృందం వారిచే కోలాటం ఉంటాయన్నారు. 29న మధ్యాహ్నం 3 గంటలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 6 గంటలకు గరుడగమన కోలాట భక్త బృందంచే కోలాటం, 30న మధ్యాహ్నం అన్నదానం , 3 గంటలకు చందరంగం పోటీలు, సాయంత్రం 6గంటలకు ఆచార్య శంకరానందస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం, 31న సాయంత్రం 4 గంటలకు తిరుమంజన సేవ, 6 గంటలకు స్టార్ మహిళ, సెప్టెంబర్ 1న గ్రామోత్సవం, కామనూరు వద్ద కుందూనదిలో నిమజ్జనోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికారి తెల్లాకుల వీరసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు చంద్రగుప్తా, చంద్రశేఖర్ లింగయ్య, సహాయ కార్యదర్శులు రాంపుల్లయ్య, ఓబులేసు, నిర్వాహక కార్యదర్శులు పి.సుధీర్, గోనా ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్, ముత్యాల సేతురావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

చాపాడు : అల్లాడుపల్లె రైతు సహకార సంఘం సొసైటీ అభివృద్ధికి పాలక వర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె రైతు సహకార సంఘం సొసైటీ చైర్మన్ గా మార్తల నరసింహారెడ్డి, కమిటీ సభ్యులుగా మేకల సుదర్శన్, గోసుల వీరారెడ్డిలు గురువారం మధ్యాహ్నం అల్లాడుపల్లె వీరభద్ర స్వామి సన్నిధిలోని టీటీడీ కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏవీ రవీంద్ర, వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, మాజీ ఎంపీపీ వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, మైనార్టీ కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరం ఓం శాంతి భవనంలో శనివారం రాజయోగిని ప్రకాశమణి దాది స్మృతి దినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసినట్లు బ్రహ్మకుమారీలు శివలక్ష్మీ, హిమబిందు తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రకాశమణి దాది పుణ్య తిథిని ఈ నెల 25న నిర్వహించుకుంటామని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. సమావేశంలో పుల్లారెడ్డి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

■ స్థానిక విజయనగరం వీధిలోని ఓంశాంతి భవనంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఓంశాంతి భవనం నిర్వాహకురాలు శాంత తెలిపారు.

ఆర్యవైశ్య సభ అధ్యక్షుడిగా చెన్నకేశవ

మైదుకూరు : మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడిగా బల్లాని చెన్నకేశవ ప్రసాద్ ఎన్నికయ్యారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం (అమ్మవారి శాల)లో బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయనను ఆర్యవైశ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడేళ్ల పదవీకాలం ముగియడంతో సభ అధ్యక్షుడిగా ఉన్న సూరిశెట్టి ప్రసాద్ పదవికి రాజీనామా చేసి కొత్తగా ఎన్నికైన చెన్నకేశవ ప్రసాద్‌కు బాధ్యతలను అప్పగించారు.

అంగన్వాడీలకు ఇచ్చిన వాగ్ధానాలు అమలుచేయాలి



ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంతో పాటు అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రవ్యాప్త సమ్మె కారణంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాల హామీలకు జీవోలు జారీ చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై గంటకో యాప్‌ను రూపొందించి అంగన్వాడీ కార్యకర్తలను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేయడం దారుణమన్నారు. అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయడంతో పాటు నెలకు రూ.26 వేలు కనీస వేతనం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, కో కన్వీనర్ పి.సి.కొండయ్య, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ బద్వేలు ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు సుభాషిణి, నాయకురాళ్లు జయప్రద, కళావతి, కె.వి.సుభాషిణి, సుజాత, రత్న, సుభద్ర, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి గురువారం పర్యటించారు. జిన్నా రోడ్డు మోటు వద్ద ఉన్న చెత్త పాయింట్‌ను కార్మికులతో శుభ్రం చేయించారు. మైదుకూరు రోడ్డులోని ప్రమీల రంగారెడ్డి హాస్పిటల్ పక్కన ఉన్న కాలువను ఎన్‌క్రోచ్‌మెంట్ చేసి మురికి నీరు పారే విధంగా చేయాలని ఆదేశించారు. ఆంధ్రకేసరి రోడ్డులో ఉన్న కాలువలో పూడికను జేసీబీ ద్వారా తొలగింపజేశారు. రోడ్డుకు ఇరువైపులా కాలువ ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆయన సూచించారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. అన్న క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, అసిస్టెంట్ ఇంజినీర్ దస్తగిరి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం



అధికారులకు సమస్య వివరిస్తున్న యూనియన్ల నాయకులు


ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ల నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ రెగ్యులర్, ఆప్కాస్, కోవిడ్ కార్మికులందరికీ కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, యూనిఫాం ఇవ్వాలన్నారు. హాలిడే రోజున మధ్యాహ్నం సెలవు ఇవ్వాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానంలో కారుణ్య నియామకాలను చేపట్టాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబంలో ఒకరికి అవకాశం కల్పించాలని తెలిపారు. ఆది, బుధవారాల్లో కార్మికులకు అరపూట డ్యూటీ అని, అయితే కార్మికులకు పూర్తి ఆఫ్‌సెంట్ వేయడంతో ఒక రోజు వేతనం కోల్పోతున్నారన్నారు. కార్మికులకు తోపుడు బండ్లు, పుష్ కాట్‌లు, కసువు డబ్బాలు, కట్టెలు, నెలకు రెండు సార్లు చీపుర్లు నాణ్యమైనవి ఇవ్వాలని తెలిపారు. సమస్యలను కమిషనర్‌కు వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య తెలిపారు.

మైదుకూరు సంఘం చైర్మన్‌గా మారుతి

మైదుకూరు : మైదుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా పాశం మారుతి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు మారుతి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ : స్థానిక కడప రోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్టీ రామారావు కాంస్య విగ్రహాన్ని గురువారం సాయంత్రం ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శామ్యూల్ దేవిడ్‌రాజ్

పోరుమామిళ్ల : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శామ్యూల్ దేవిడ్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం, ఐఐఈసీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో వినూత్న ఆలోచనలతో కొత్త కొత్త ఆవిష్కరణల ద్వారా స్వయం ఉపాధి పొందుతూ పలువురికి ఉద్యోగాలు కల్పించే శక్తిగా ఎదగడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంకుర పరిశ్రమలు, మేకిన్ ఇండియా స్కిల్ హబ్ వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, కామర్స్ అధ్యాపకులు పర్వీన్, ఎం.ఈశ్వరయ్య, రవిచంద్ర సులోచన, సబిత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట



సర్వస్వతీదేవికి పూజలు చేస్తున్న వేదపండితులు

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు తులసిరామకృష్ణ నేతృత్వంలో గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఘనంగా పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతి విగ్రహ స్థాపనకు, పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్‌రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ దాదన శేఖర్‌రెడ్డి, మేకవారిపల్లె నీటి సంఘం అధ్యక్షుడు సిద్దు వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచులు పెద్దిరెడ్డి లక్ష్మీనరసారెడ్డి, బోరెడ్డి శేషారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



ఎస్ఐ తిమోతి

కలసపాడు : బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు, విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ తిమోతి తెలిపారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మండపాలు, వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక చవితి పండుగను సజావుగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని కోరారు. అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మండపాలను పోలీసు అధికారులు తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరంభ్యంతర పత్రాన్ని ఇస్తామని తెలిపారు. వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనం రోజున నిబంధనలను పాటించాలని సూచించారు.

సోషల్ మీడియాపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీఐ రమణారెడ్డి

మైదుకూరు : సోషల్ మీడియా ఇంటర్నెట్ వినియోగంపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వనిపెంట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సోషల్ మీడియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియా, ఇంటర్‌నెట్ ద్వారా ఎంత మంచి జరుగుతుందో అంతే స్థాయిలో చెడు జరిగేందుకు కూడా అవకాశం ఉందన్నారు. అందువల్ల సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చదువులు, నైపుణ్యాలు నేర్చుకునే దశలో, సామాజిక మాధ్యమాల వలలో చిక్కుకుంటే భవిష్యత్తు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ

బద్వేలు అర్బన్ : బాలల హక్కుల పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలు ఎవరైనా ప్రమాదంలో ఉన్నా, అత్యాచారం, వేదనకు గురైన పిల్లలు, బాలకార్మికులు గురించి 1098 నెంబర్‌కు సమాచారమిచ్చి వారి హక్కులను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామాల్లో బాల్యవివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్‌పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు వసంతకుమారి, పద్మిని, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.వి.మౌనిక, అంగన్వాడీ కార్యకర్తలు యల్లమ్మ, జయశ్రీ, చిన్నగురమ్మ, లైసమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ రూరల్ కార్యదర్శి ఇమ్మానియేల్

బద్వేలు అర్బన్ : ఒంగోలులో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానియేల్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎద్దుల ఈశ్వర్‌రెడ్డినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికై, నిరుద్యోగుల, రైతాంగ సమస్యల పరిష్కారానికి వేదికగా రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాల నాగేశ్వర్‌రావు, జె.వి.సత్యనారాయణ హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల నాయకులు సుబ్బారెడ్డి, కృప, సుధాకర్, బ్రహ్మయ్య, వెంకటేష్, అభిరామ్, అయ్యవారమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అర్బన్ స్టేషన్ పీఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బద్వేలు అర్బన్ స్టేషన్ పీఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ ద్వారా ఎంత మంచి జరుగుతుందో అంతే స్థాయిలో చెడుకు కూడా అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చదువు, నైపుణ్యాలు నేర్చుకునే దశలో సామాజిక మాధ్యమాల వలలో చిక్కుకుంటే భవిష్యత్తు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల్లో క్రియాశీలత లోపించి చదువులో వెనుకబడి ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. అనంతరం సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్లను బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయించాలి

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయించి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడు లోగల హరిజనవాడలోని ఎంపీపీ స్కూల్‌ను గురువారం డీఈఓ షంషుద్దీన్ తనిఖీ చేసిన సందర్భంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తక విధానం వల్ల ఉపాధ్యాయులకు బోధనా సమయం వృధా అవుతోందని, టీచర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. మూల్యాంకన పుస్తక విధానాన్ని రద్దు చేసి పూర్వ విధానంలోనే పరీక్ష పేపర్లను మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లో మార్కులను నమోదు చేసేలా చూడాలన్నారు. అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయకూడదని విజ్ఞప్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, మల్లికార్జున, జిల్లా కౌన్సిలర్లు సుబ్బయ్య, అప్సర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం మండలాన్ని అభివృద్ధి చేస్తా



బాధ్యతలు స్వీకరిస్తున్న సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడు సాంబశివారెడ్డి

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారిమఠం మండలాన్ని అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం సోమిరెడ్డిపల్లి సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడు వెల్లటూరు సాంబశివారెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం 33 కోట్ల రూపాయలు రైతులకు రుణాలు ఇచ్చిందన్నారు. తీసుకున్న ప్రతి రైతు తిరిగి చెల్లిస్తే మరొక రైతుకు అవకాశం వస్తుందన్నారు. మండలంలో కొంతమంది బోగస్ పట్టాదారు పాస్ పుస్తకాలు పెట్టి మండలంలో చాలామంది లోన్ తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. తప్పిదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సహకార సంఘం పై ఉందన్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం అభివృద్ధికి అన్నప్రసాదం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు డీసీఓ సత్యానంద్, సిబ్బంది, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.